# వాన కురిసిన రాత్రి

నేను ముత్యపు చిప్పనుకాను!

నాకు ఆనందం కల్గించటానికి స్వాతి చినుకులే అక్కరలేదు. వాన చినుకులు ఎప్పుడు నింగి నుండి రాలినా నాకిష్టమే.నల్లని మబ్బులనుండి పూసలదండలా చినుకులుపడుతూ వుంటే నాకు ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది.మట్టిమీద చినుకులు పడిన తరువాత గాలిమోసుకొచ్చే వింత పరిమళమంటే నాకు ఎంతో ఇష్టం.చీకటి సుందరి పెదవిమీద చిరునవ్వులా వెలిగిమాయమయ్యే మెరుపులు చూడటంలో నాకుఎంతో తృప్తిలభ్యమవుతుంది. వాన కురుస్తున్నపుడు గదిలో కూర్చుని వెచ్చగా సిగరెట్లు పీలుస్తూ కథలు రాయడం నాకు దాదాపు ఒక హాబీలాంటిది!

కానీ - రెండు సంవత్సరాల క్రితం జరిగిన ఆ సంఘటన నన్ను పూర్తిగా మార్చివేసింది. ఇపుడు వర్షం కుర్తుస్తూవుంటే ఆనాటి దృశ్యమే నా కనులముందు ప్రత్యక్షమౌతుంది! నాపాపాన్ని, కుటిలత్వాన్ని, స్వార్థాన్నీ ఎత్తిచూపి ఎగతాళి చేస్తూ వుంటుంది, ఈనాటికీ ఆ సంఘటన!! ఇపుడు వర్షం కురుస్తూ వుంటే ఆ హెూరు ఎవరో బాధగా మూలుగుతున్నట్లు, రాక్షసి ప్రసవవేదనను అనుభవిస్తున్నట్లు, అన్పిస్తుంది. కొన్ని కోట్ల గొంతులు వెక్కి వెక్కి ఏడుస్తూ వుంటే ఆ కన్నీరే వర్షం కురుస్తున్నట్లు బాధపడతాను.

రెండు సంవత్సరాల క్రితం ఆ రాత్రి -

కాటుకలా నల్లని మబ్బులు నింగిని ఆక్రమించుకున్న రాత్రి చెట్లను నేలగూల్చేలా ప్రచండ వేగంతో గాలి వీచిన రాత్రి ఏనుగు తొండంలాంటి ధారలతో వర్షం కురిసిన రాత్రి, ఆరాత్రి, నాకు బాగా జ్ఞాపకం.

గది తలుపులు బిగించి, కుర్చీలో కూర్చుని, కాళ్లుటేబిలుమీద పెట్టి, సిగరెట్లు అగ్గిపుల్లల్ని వేస్టు చేయకుండాకాలుస్తూ... రాచకొండ విశ్వనాథశాస్త్రిగారి 'మంచి చెడ్డల్లో ఏకథ?" చదవటం పూర్తి చేసి ఆలోచనలోపడ్డాను.

ఆ కథలో రెండు భాగాలున్నాయి.మొదటి భాగంపేరు 'మంచి',రెండో భాగం పేరు 'చెడ్డ',రెండూ మంచి కథలే, రెండూ గొప్ప కథలే - రెండు కథలూ ప్రతిమనిషిలోనూ, ఆలోచన రేపే కథలే!! 'ఆ రెండు కథల్లో మీకు ఏది ఎక్కువ ఇష్టమో చెప్తే, మీ స్వభావం కొంత వరకూ వెల్లడవుతుంది.' అంటూ చివరన ఓ పరీక్ష పెట్టారు రచయిత.

ఎంతసేపు ఆలోచించినా ఆ రెండు కథలలో నేను దేనిని ఎక్కువ ఇష్టపడ్డానో, నిర్ణయించుకోలేక పోయాను. కానీ, ఇపుడు అనిపిస్తోంది వాటిలో నాకు రెండో భాగమే ఎక్కువనచ్చిందని...

ఆ ఆత్మపరీక్షా సమయంలో, తలుపు దబదబ బాదిన చప్పుడయింది.!లేచి వెళ్ళి తలుపు తీశాను. వర్షపు జల్లు ఒక్కసారి నా మొహాన కొట్టింది!

ఎదురుగా ఆయాసంతో, తడిసి ముద్దయిన ఆకారం ! అది జగన్నాథానిది!!

గబగబా గదిలోనికి వచ్చేడు జగన్నాథం! వాడు నాతోటి గుమస్తా. మీరు ఒక్కసారి వాడిని చూస్తే వీడు చిరుగుమస్తా వెధవ అని పోల్చేస్తారు. ఈ దేశంలో గుమస్తాలు పడే బాధలన్నీ వాడి ముఖంలో గూడు కట్టుకుని వుంటాయి.

జగన్నాథం చూడటానికి చాలా బాధగా కన్పిస్తాడు. వాడి ముఖంలో మంచితనం కొట్టొచ్చినట్లు కనబడకపోయినా, జగన్నాథం అతిమంచివాడు. వాడి మంచితనం నిజాయితీ ఈరెండూ కలిసి వాడిని అతి దారిద్ర్యావస్థకు తీసుకువెళ్ళేయి.

"ఇంతవర్షంలో ఇలా వచ్చేవేమిటి?" అంటూ అడిగేను.

"రాజూ! అర్జెంటుగా యాభయి రూపాయలుకావాలి! నువ్వు సర్దగలవనే ఆశతో వచ్చాను. ఈ సహాయం చేస్తే ఈ జన్మలో నీ మేలు మరిచిపోలేను" ఉద్వేగంతో అన్నాడు. నాకు కొంత ఆశ్చర్యం కల్గినమాట వాస్తవం. 'ఇంతరాత్రి సమయంలో యాభయి రూపాయల అవసరం వీడికేం వచ్చింది?' అనుకున్నాను.

నా వద్ద డబ్బుంది. మరుసటి దినం టెర్లిన్ చొక్కా కుట్టించాలనుకున్నాను. ఇపుడు యాభయి రూపాయలు వాడికి ఇచ్చేస్తే అది ఇంతలో తిరిగిరాదు. నా టెర్లిన్ చొక్కా కుట్టించుకోవాలనే ఆశ ఇంతలో తీరదు. మనసు జగన్నాథానికి సహాయం చేయటానికి ఒప్పుకోలేదు.

"ఒక్కసారిగా యాభయిరూపాయలు కావాలంటే ఎక్కడనుండి వస్తాయి? నేనూ నీలాగ గుమస్తానేకదా" అని నిలువుగా అబద్ధం ఆడేసి, ఒక నవ్వు ముఖానికి పులుముకున్నాను. జగన్నాథం ముఖంలో నిరాశస్పష్టంగా తొంగి చూసింది.

"నీ దగ్గర వుంటుందనే ఆశతోవచ్చేను. ఏం చేస్తాం? మరొక చోట ప్రయత్నిస్తానులే" అంటూ తలుపులు తెరుచుకుని, తొందరగా అడుగులు వేసుకుంటూ వర్షంలోనికి నడిచి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రంతా వర్షం కురుస్తూనే ఉంది. వర్షం కురిసిన రాత్రి తెల్లారింది.

వాన వేగం తగ్గినా, చినుకులు మాత్రం పడుతూనే వున్నాయి. ఉదయం తొమ్మిది గంటలకు హొటల్లో భోజనం ముగించి, ఆఫీసు వైపుకు నడకసాగించేను.

రోడ్డు బురదగా వుంది. మళ్ళీ పెద్దదవబోయే వర్షాన్ని సూచిస్తూ నింగిలో మబ్బులు ముసురు కుంటున్నాయి.

ఆఫీసుదారిలోనే జగన్నాథం ఇల్లు అరుగుమీద స్థంభానికి ఆనుకొని కూర్చుని పిచ్చిగా శూన్యంలోకి చూస్తున్నాడు వాడు. నెలరోజులనుండి తిండిలేనివాడిలా అతినీరసంగా వున్నాడు వాడు.

వరండాలోనికి మెల్లిగా అడుగుపెడుతూ అడిగేను. "ఏం జగన్నాథం? అలా కూర్చున్నావేం?" నన్ను చూడగానే వాడు కన్నుల్లో నీరు చిప్పిల్లింది.

"కూర్చోక ఏం చేయగలను? నేను అసమర్థుణ్ణి! దరిద్రుణ్ణి! ఎందుకూ పనికిరాని

వాడిని. నాలాంటి వాళ్ళను భగవంతుడు ఎందుకు పుట్టిస్తాడో తెలీదు. లోకంలోని నిర్భాగ్యపు గుమస్తాలందరూ కలిసి దేవుడిమీద తిరగబడ గలిగితే ఎంత బాగుంటుంది?"

కొంతసేపు మాటలు ఆపేడు నేను చేష్టలుడిగి అతడి వంకే చూస్తూ వుండిపోయాను.

గొంతు సవరించుకుని మళ్ళీ అన్నాడు ".... మూడురోజులనుండీ నా భార్యకు జ్వరం! నిన్నరాత్రి పరిస్థితి విషమించింది. డాక్టరు తాను చేయగలిగింది ఏదీ లేదన్నాడు. ఈ వూళ్ళో వైద్య సౌకర్యాలు తక్కువ కనుక విశాఖపట్నంలోని పెద్దాసుపత్రికి వెంటనే తీసుకుపొమ్మన్నాడు. పెద్దాసుపత్రిలో చేరిస్తే ఫలితం వుండే అవకాశం వుందన్నాడు. కానీ... కానీ... ఆమెను విశాఖపట్నం ఎలా తీసుకువెళ్ళగలను? నా చేతిలో పది రూపాయలకంటె ఎక్కువలేవు. ఎవరిదగ్గరా నయాపైసా అప్పుపుట్టలేదు. ఇంక అప్పు చేయవలసిన అవసరం లేదులే... నా భార్యను విశాఖపట్నం పెద్దాసుపత్రికి తీసుకుని వెళ్ళవలసిన అవసరం కూడా లేదు: పిడికెడు బుగ్గి చేస్తే చాలు!

నా భార్య

నా దారిద్ర్యానికి, అసమర్థతకూ బలి అయిపోయిన నాభార్య, లోపల మంచంమీద అతి ప్రశాంతంగా నిద్రపోతోంది చూడు...."

మాటలు ఆపి, బిగ్గరగా విచిత్రంగా నవ్వుతున్నాడు జగన్నాథం.

అలా నవ్వుతూ వుంటే, వాడిలో నుండి ఏదో భయంకరమయిన భూతం బయటకు వచ్చి, నా జుట్టు పట్టుకుని పీకుతున్నట్లనిపించింది!

నా గుండెల్లో దడ, కాళ్ళలో వణుకు ఆరంభమయ్యేయి.

'నిన్న రాత్రి నేను జగన్నాథానికి డబ్బు ఇచ్చివుంటే పరిస్థితి ఎలా వుండేది?'......

మరి ఆలోచించలేకపోయాను.

జేబులోని నోట్లు గొంగళీ పురుగుల్లా మారి, శరీరం మీద పాకుతున్నట్లు అనిపించింది.

"ఈడబ్బు వుంచు! తరువాతి పనులకు పనికి వస్తుంది". అంటూ జేబులోని పురుగుల్లాంటి నోట్లను తీసి, వాడిమీదకు విదిల్చేను.

బయట వర్షంతో బాటు నాలోని బాధాగ్ని హెచ్చవుతోంది!

నాలోని కుటిలత్వాన్నీ, స్వార్థాన్నీ ఈ వర్షపునీరు కడగలేదు!!

వర్షపు హోరు ఎవరో ఏడుస్తున్నట్లుంది!!! ★

(కథాంజలి మంత్లీ 1963)